భూదాన్ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

గన్‌ఫౌండ్రీ: భూదాన్ యజ్ఞబోర్డు మాజీ చైర్మన్ గున్నా రాజేందర్ రెడ్డి అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ అన్నారు. గాంధీభవన్ టీఎస్ఎం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ చైర్మన్ పేదలకు చెందాల్సిన భూదాన్ భూములను వివిధ పేర్లతో ఆక్రమించారని ఆరోపించారు. ఈ ఆక్రమణలపై ఐఏఎస్ అధికారి ఎస్‌కే.సిన్హా నివేదిక సమర్పించారని, అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నివేదికను పరిశీలించి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సర్వోదయ మండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రామ్, మోహన్‌రావు, చందూరి గోపాల్, లతక్క, జోపాక రమేశ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా భావం అలవర్చుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖురేషి

గోల్కొండ: యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ సలహాదారు ఖురేషి అన్నారు. టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో గోల్కొండ యూత్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కుటుంబ తగాదాల పరిష్కారమే కాకుండా భార్యభర్తలు కలహాలతో విడిపోకుండా వారికి కౌన్సిలింగ్ నిర్వహించడమే ప్రధాన టాస్క్ అని అన్నారు. కోవిడ్ కష్టకాలంలో తమ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు అండగా నిలిచామన్నారు. ఆపత్కాల సమయంలో యువత మేమున్నామంటూ ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ నజీబ్, ఖాలేద్‌అలీఖాన్, వాజీద్ తదితరులు ఉన్నారు.

నిధుల కొరత లేకుండా చూడాలి


దూమర్ల నిరంజన్

అబిడ్స్: పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ వంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధుల కొరత లేకుండా చూడాలని తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపీఈటీఏ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూమర్ల నిరంజన్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులకు పాఠశాల స్థాయిని బట్టి మంజూరైన 25 శాతం నిధులకు బదులు 100 శాతం కేటాయించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులు వేగవంతం చేసేందుకు 100 శాతం నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేయవచ్చన్నారు. అలాగే పాఠశాలల ప్రారంభానికే ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రా'ఫికర్'


కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్

గోల్కొండ: గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రా'ఫికర్' నెలకొన్నది. కోటను చూసేందుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వీరితో పాటు రాందేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట చౌరస్తా మీదుగా షేక్‌పేట్ చౌరస్తా వెళ్లే వారు, లంగర్‌హౌజ్ నుంచి సైతం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కోట చౌరస్తా మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటున్నది. ముఖ్యంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గోల్కొండ చౌరస్తాలో పర్యాటకులు నానా అవస్థలు పడుతున్నారు. కోట ఫెన్సింగ్‌ను ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును కూడా పలువురు తోపుడు బండ్ల వారు ఆక్రమించారు. కోట మెయిన్ గేటు ఇరువైపులా వివిధ రకాల వ్యాపారాలు కూడా రోడ్డుపైనే సాగుతుంటాయి. కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ నివారించాలంటే ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని, ఆటోలను కోట చౌరస్తా వద్ద కాకుండా రాందేవ్‌గూడ రోడ్డు వైపు ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన సీల్‌వెల్ సినీ సుస్వరాలు


దర్శకుడు రేలంగి నర్సింహారావుకు పురస్కారం అందజేస్తున్న బండారు సుబ్బారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రీ భారతీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన సీల్‌వెల్ సినీ సుస్వరాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు రేలంగి నర్సింహారావుకు దాసరి దర్శక శిరోమణి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె. దామోదర్ గుప్తా మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఏఎస్ఆర్.కృష్ణ, దాసరి నారాయణరావు జయంతి వేడుకలను ఒకే వేదికపై నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు గాయనీ గాయకుల సినీ గీతాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ కోచింగ్

బహదూర్‌పురా: సెయింట్ మార్క్ బాయ్ టౌన్ స్కూల్‌లో నెలరోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ ముగిసింది. ఈ సందర్భంగా అండర్–14, అండర్–16, అండర్–19 విద్యార్థులకు కోచ్‌లు పాఠశాల యాజమాన్యంతో కలిసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ యేడు కూడా వందలాది మంది విద్యార్థులకు క్రికెట్ కోచింగ్ శిక్షణ ఇచ్చామని తెలిపారు.



కోచింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

బహదూర్‌పురా: బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వెంకట్‌రెడ్డికి నాంపల్లిలోని తొమిమదో ఎంఎం కోర్టు న్యాయమూర్తి 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ3300 జరిమానా విధించారు. మరో ఇద్దరికి 4 రోజుల జైలు, రూ.3300 ఫైన్, మరొకరికి 2 రోజుల జైలు రూ.2100 జరిమానా విధించినట్లు బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

పనులు పూర్తయ్యేదెన్నడో..?

- కార్వాన్ నియోజకవర్గంలో నత్తనడకన సాగుతున్న నిర్మాణాలు
- వాహనదారులు, ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


టోలిచౌకీ చౌరస్తా వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తను తలపిస్తున్నాయి. ఓ వైపు డ్రైనేజీ, వరద నీటి పైపు లైన్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది వరద నీటి పైపులైన్ పనులు ప్రారంభం కాగా తూమ్స్ రోడ్డు, టోలిచౌకీ చౌరస్తా, ఎండీ లైన్స్‌తో పాటు ఇంకా ఎన్నో ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే టోలిచౌకీ చౌరస్తా భారీ గుంత తవ్వి వదిలేయడంతో వాహనదారులు, పాదాచారులతో పాటు వ్యాపారులకు సైతం ఇబ్బందిగా మారాయి. తవ్విన మట్టి గుట్టలు, మరోవైపు భారీ గుంతలు రోజుల తరబడి నిలిపి ఉన్న జేసీబీలతో తీవ్రంగా ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ఈ విషయమై ప్రజాప్రతినిధులు అధికారులు, గుత్తేదారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోలిచౌకీ నుంచి గోల్కొండ మోతీదర్వాజా వెళ్లే రోడ్డుపై పైపులు వేసేందుకు మూడు చోట్ల భారీ గుంతల కారణంగా ఆ ప్రాంతాల్లో వాహనాలను అనుమతించడం లేదు. గత నెలలో భారీ గుంతలో ప్రమాదవశాత్తు ఓ పాదాచారి పడి మృతి చెందాడు. అయినా కూడా అధికారులు పనుల్లో వేగం పెంచకపోవడం శోచనీయం. టోలిచౌకీ చౌరస్తా వద్ద జరుగుతున్న పనుల కారణంగా ఇక్కడి ఆలయానికి వచ్చే భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే టోలిచౌకీ వద్ద దశాబ్దాలుగా లేబర్ అడ్డా ఉంది. కూలీలకు సైతం నిల్చునేందుకు స్థలం లేకుండాపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఎండీ లైన్స్ చౌరస్తా వద్ద నత్తనడకన సాగుతున్న పైపులైన్ పనులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా నేటి ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్, ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మదీనా విద్యుత్ ఫీడర్ పరిధిలో..

నయాపూల్, మదీనా, పటేల్‌మార్కెట్, బీజీ మార్కెట్, రికాబ్‌గంజ్, పత్తర్‌గట్టి తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే క్యుక్యు స్టేడియం విద్యుత్ ఫీడర్ పరిధిలోని కుడా స్టేడియం, సిటీ కాలేజీ, మెహందీ, చెలాపూరా, మూసాబౌలి, హుస్సేనీఆలం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు, పురానీహవేలీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చత్తాబజార్, పురానీహవేలీ, లక్కడ్ కోట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జహ్రానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జహ్రానగర్, మీరాలం మండి, షెహరాన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

రక్షాపురం విద్యుత్ ఫీడర్ పరిధిలోని రక్షాపురం, గుల్షన్ ఎక్బాల్ కాలనీ, అరుంధతి కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. అలాగే నషీబ్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చాంద్రాయణగుట్ట, నషీబ్‌నగర్, ఫూల్‌బాగ్, నందినీనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, కందికల్‌గేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కందికల్‌గేట్, ఘాజీమిల్లత్ కాలనీ, తాళ్లకుంట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

విద్యా వ్యవస్థలో మార్పు రావాలి

నాంపల్లి: విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆలిండియా రక్షణ సేనా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అలాగే జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలో అవకతవకలు జరుగుతున్నాయని, విచారణ జరిపించాలని కోరారు. విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులపై చర్యలు తీసుకునే అధికారం తనకు లేదని, ప్రభుత్వమే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రొఫెసర్ లింబాద్రి చెప్పారని ఆయన తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి అందిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలిండియా రక్షణ సేనా పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎం.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

25న జీఎన్ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఈ నెల 25వ తేదీన గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ ప్రొఫెసర్ సునైనాసింగ్ ముఖ్య అతిథిగా, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 2020–2024 బ్యాచ్‌కు చెందిన బీటెక్, ఎంటెక్ అభ్యర్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

తంగెడ కిషన్ రావుకు ఘనంగా వీడ్కోలు


ఆచార్య తంగెడ కిషన్ రావును సత్కరిస్తున్న ఆచార్య వై.రెడ్డి శ్యామల, రామ్మూర్తి

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు పదవీకాలం పూర్తయింది. దీంతో కొత్త వీసీని నియమించే వరకు ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్ మంగళవారం నుంచి ఇన్‌చార్జి వీసీగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కిషన్‌రావును సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, ఆచార్య వై.రెడ్డి శ్యామల, రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువతకు హెచ్‌సీఏ ప్రోత్సాహం


సుఫియాన్‌ను అభినందిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

గోల్కొండ: క్రికెట్‌పై ఆసక్తి ఉన్న టీనేజీ పిల్లలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సహిస్తుందని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. నిజామబాద్‌కు చెందిన మహ్మద్ సుఫియాన్ హెచ్‌సీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం హెచ్‌సీఏ అధ్యక్షుడిని కలిశారు. నిజామబాద్ జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో సోఫియాన్ అత్యంత వేగంగా బంతులు విసురుతూ ఫాస్ట్ బౌలర్‌గా ఎదుగుతున్నాడన్న విషయం తనకు తెలిసిందన్నారు. మంచి కోచ్ వద్ద శిక్షణ పొంది అత్యుత్తమ క్రికెటర్‌గా ఎదగాలని ఆయన సోఫియాన్‌కు సూచించారు.

రాజీవ్ గాంధీ చొరవతోనే ఐటీలో నెంబర్ వన్


వేడుకల్లో పాల్గొన్న ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్

అబిడ్స్: మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చొరవతోనే భారత్ ప్రపంచంలోనే ఐటీ రంగంలో నెంబర్ వన్ స్థాయిలో ఉందని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు దశ నలుమూలల సాంకేతిక రంగం నంబర్ వన్ స్థాయిలో ఉందన్నారు.

భారత్‌లో విస్తరిస్తున్న ఫ్రెంచ్ ఫిన్‌టెక్ 'స్టడీలీ'


క్లైర్ నోగూరా

అబిడ్స్: ఫ్రాన్స్, జర్మనీలోని భారతీయ విద్యార్థుల సంఖ్య వారి ఆర్థిక, రవాణా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఫ్రెంచ్ ఫిన్ టెక్ స్టడీలీ ఏర్పాటు చేశామని ఆ సంస్థ సీఈఓ క్లైర్ నోగూరా పేర్కొన్నారు. మంగళవారం క్లైర్ నోగూరా మాట్లాడుతూ.. ఫ్రాన్స్‌లో తమ సంస్థ ప్రధాన కార్యాలయం ఉందని భారత్‌లోనూ విస్తరణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఫ్రాన్స్, జర్మనీలోని భారతీయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, ఆర్థిక అవసరాలకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో ఒకటి అని అన్నారు.

చెట్టు ఎక్కి వ్యక్తి హల్‌చల్


నవీన్‌ను కిందకి దించుతున్న ఫైర్ సిబ్బంది

సుల్తాన్‌బజార్: చెట్టు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో చోటు చేసుకుంది. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన నవీన్ (42) తన వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకుంటానని ఓ పెద్ద చెట్టు ఎక్కాడు. గంటన్నర పాటు చెట్టుపైనే ఉండడంతో ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని నవీన్‌ను ఎట్టకేలకు రెస్క్యూ చేసి కిందకు దించారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్/దూద్‌బౌలి: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక కమిటీ అధ్యక్షుడు నిరంజన్ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలవూలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాజీవ్ సద్భావన స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు జి. కన్నయ్యలాల్, కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్, ముజీబ్ ఉల్లా షరీఫ్, కె.వెంకటేశ్, దిలావర్‌హుస్సేన్, చంద్రశేఖర్, ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి


ఖురాన్ గ్రంథాన్ని పఠిస్తున్న విద్యార్థులు

గోల్కొండ: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోల్కొండ రిసాలాబజార్‌లోని మదర్సా రహమత్ ఉల్ఉలూమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్‌అలీషా ఖాద్రీ సూచించారు. మదర్సాలో పదేళ్లలోపు విద్యార్థులకు ప్రత్యేక సెక్షన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్సాకు వచ్చే విద్యార్థులు క్రమ శిక్షణ అలవర్చుకుంటారని అన్నారు.

పాన్‌షాప్ నిర్వాహకుడికి జైలు

విజయనగర్‌కాలనీ: పాన్‌షాప్ నిర్వహకుడికి 5 రోజుల జైలు శిక్ష పడింది. ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయం సమీపంలో మహ్మద్ మజర్ పాషా (21) పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి అయినప్పటికీ పాన్ షాపు నిర్వహిస్తుండడంతో ఎస్ఐ శ్రీనివాస్ తేజ మజర్‌పాషాను అదుపులోకి తీసుకుని నాంపల్లి నాలుగో స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డీసీ ఉమాపతిరావు నిందితుడికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అర్హులందరికీ ఇండ్లు కేటాయించాలి

అబిడ్స్: బషీర్‌బాగ్ పూల్‌బాగ్‌లో జేఎన్ఎన్ఎంఆర్ పథకం కింద నిర్మించిన ఇండ్లను వెంటనే అర్హులకు కేటాయించాలని రాష్ట్ర బీజేపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు భీశ్వ ఓం ప్రకాశ్ డిమాండ్ చేశారు. పూల్‌బాగ్‌లో మంగళవారం నాయకులతో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల నిర్మించి నాలుగేళ్లు అవుతున్నా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సీఎం ఇండ్లను కేటాయించాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గోషామహల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కృష్ణ, నాయకులు నిర్మల్‌రాజ్, రాకేశ్, వివేకానంద, ప్రేమ్ పూర్ణజ్ఞానేశ్వర్, ఇక్బాల్, రాము, సాయిగౌడ్, మహేశ్‌గౌడ్, పరశురాం గౌడ్‌తో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అబిడ్స్: అబిడ్స్ బషీర్‌బాగ్, బొగ్గులకుంట పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సైఫాబాద్ విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు 11 కేవీ.బషీర్‌బాగ్ ఫీడర్ పరిధిలో బషీర్‌బాగ్ రోడ్డు, మెరీడియన్ ఆఫ్ హైదరాబాద్ నర్సింగ్ హోమ్ ప్యాలెస్ ఆకాని బీఎస్ఎన్ఎల్ జూనియర్ కార్యాలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి 3 గంటల వరకు 11 కేవీ. కామినేని హాస్పిటల్ రోడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవి బొగ్గులకుంట ఫీడర్ ప్రాంతంలోని అబిడ్స్‌తో పాటు షో రూం రోడ్డు, తిలక్ రోడ్డు, ఎల్ఐసీ ఆఫీస్ ప్రాంతాల్లో ఫ్యాక్టరీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.